# తమసోమా జ్యోతిర్గమయా

(మానవాళి విముక్తి మార్గము)



జేమ్సు జయశీల్ చౌధరి

# తమసోమా జ్యోతిర్గమయా

(మానవాళి విముక్తి మార్గము)

జేమ్సు జయశీల్ చౌధరి

పురుషోత్తము చౌధరి పబ్లికేషన్స్

# క్రీస్తు పూర్వము - పాత నిబంధన

**సృష్టి:** – భూమ్యాకాశములు జలమయముగాను, అంధకారములో వుండెను. దేవుడు తన వాక్కు ద్వారా ఐదు రోజులలో సర్వమూ సృజించాడు. అవేమనగా మొదటిరోజు – వెలుతురు, పగలు, రేయి, రెండవరోజు – ఆకాశము, మూడవరోజు – భూమి (నేల), సముద్రము సమస్త వృక్ష జాతులు, నాల్గవ రోజు – సూర్య చంద్రులు, ఐదవ రోజు – సమస్త జలచరములు, పశుపక్ష్యాదులు, కీటకాదులు.

**మానవ సృష్టి :–** ఆరవ రోజున, దేవుడు తన స్వహస్తములతో, తన రూపములో ఒక మట్టి బొమ్మను చేసి దాని ముక్కులో జీవ వాయువు ఊది నరుని సృష్టించాడు. నరుని ప్రక్క టెముక నుండి నారి (స్త్రీ) ని సృష్టించాడు. నరుని పేరు ఆదాము, స్త్రీ పేరు హవ్వ. ఏడవరోజు విశ్రాంతి దినము.

**దేవుడు - నరుడు :–** దేవుడు తను చేసిన సర్వసృష్టిపై మానవునికి అధికారమిచ్చాడు. ఆదాము, ప్రతి చెట్టుకి, ప్రతి జలచర, పశు, పక్షి కీటకాదులకు పేర్లు పెట్టాడు.

**ఏదేను వనము :–** ఒక అందమైన తోటను సృష్టించి అందులో ప్రతివిధమైన ఫలవృక్షములను దేవుడు మొలిపించాడు. ఆ తోటలో జీవవృక్షమును, జ్ఞానవృక్షమును కూడా మొలిపించాడు. ఆదాము, హవ్వలను అందులో వుంచి సుఖంగా జీవించమన్నాడు. అయితే వారు జ్ఞానవృక్షఫలము తింటే మరణిస్తారు అని చెప్పాడు. తోటలోని ఫలములు ఆరగిస్తూ, ఏ చీకూ చింతా లేకుండా ఆదాము, హవ్వలు జీవించు చుండిరి. ప్రతి రోజు సాయంకాలము దేవుడు వారితో గడిపేవాడు. దేవునితో వారి సాంగత్యము చక్కగా కొనసాగింది.

**సైతాను ప్రవేశము: -** దేవుని వద్ద అనేకమంది దేవదూతలున్నారు. ప్రధాన దూతలైన వారిలో యొకడు "లూసిఫర్" అనువాడు మిడిసి పడి, దేవునికన్నా తనను తాను హెచ్చించుకొనాలనుకొన్నాడు. దేవుడు లూసిఫర్‌ను స్వర్గమునుండి నెట్టివేశాడు. ఆ లూసిఫరే ఈ సైతాను.

**నరుడు పాపములో పడుట: -** సైతాను పాములూపము ధరించి, హవ్వతో పరిచయము పెంచుకున్నాడు. జ్ఞానవృక్షఫలము తింటే మీరు చావరు సరికదా, మీకు జ్ఞానము అలవడుతుందని నమ్మించాడు. హవ్వ జ్ఞానవృక్షఫలము తిని ఆదాముచేత కూడా తినిపించింది. అప్పుడు వారు నగ్నంగా వున్నామని తెలుసుకొని తమ శరీరాలను ఆకులతో కప్పుకొన్నారు. సాయంత్రము దేవుడు వారితో గడుపుటకు రాగా, వారిరువురూ పొదలవెనక దాగున్నారు. ఈ సంగతి తెలుసుకొని దేవుడు పామును, ఆదాము హవ్వలను శపించాడు. మన్ను తిని నేలపై ప్రాకుతూ బ్రతుకుతావు, స్త్రీ సంతానము నిన్ను తలపై కొడతారు, నీవు స్త్రీసంతానాన్ని మడమపై కాటు వేస్తావు అని పామును; నీ భర్తయెడల నీకు వాంఛ కలుగుతుంది, నీవు గర్భము ధరించి వేదనతో పిల్లలను కంటావని హవ్వ (స్త్రీ)ని; నాఆజ్ఞ ధిక్కరించావు కనుక చెమటోడ్చి, నేల సాగు చేస్తే కాని నీకు ఆహారము దొరకదని ఆదాము (పురుషుడు)ని దేవుడు శపించాడు. వారు ఏదేను వనములో వుంటే, జీవవృక్షఫలము తిని సదాకాలము జీవిస్తారని, వారిరువురిని ఏదేనుతోట నుండి బయటకు పంపేశాడు. తిరిగి తోటలో ప్రవేశించకుండా తన దూతలను తోటకు కాపలా వుంచాడు. వారి నగ్నత్వము మఱుగు పరుచుకొనులాగున, దేవుడు ఒక జంతువును చంపి, దాని చర్మాన్ని వారికి చొక్కాలుగా ధరింపచేశాడు.

ఈ విధముగా మానవుడు అవిధేయుడై పాపము చేసి, దేవునితో సంబంధం కోల్పోయాడు. జ్ఞానవృక్షఫలము తినుటవలన నరజాతికి మరణము సంభవించింది.

అయితే మంచి చెడుల విచక్షణ వారికి కలిగినందున, వారు జీవించేసరళిలో దేవుడు వారికి స్వాతంత్రమిచ్చాడు.

**మానవుని విస్తరణ :-** ఆదాము, హవ్వలకు పిల్లలు పుట్టారు. పిల్లల్లో ఆడా,మగా భార్యాభర్తలుగా ఏర్పడ్డారు. వారికి సంతానాభివృద్ధి కలిగి భూమిపై విస్తరించారు. మంచి చెడ్డల విచక్షణా జ్ఞానమున్ననూ, చెడువైపే మ్రొగ్గి మానవులు పాపము చేయుచుండిరి.

ఆదాము మొదటి సంతానమైన కయీను, వారి రెండవ సంతానమైన హేబెలును చంపివేశాడు. కారణము మంచి మనసుతో హేబెలు అర్పించిన బలిని దేవుడు స్వీకరించాడు. కయీను దోషపూరిత అర్పణను దేవుడు తిరస్కరించాడు. అసూయ హత్యకు దారితీసింది.

తాను స్వహస్తములతో చేసిన నరుడు పతనమయి పోవుట చూసిన దేవుడు సృష్టి నాశనానికి తలపెట్టాడు.

**జలప్రళయము - నోవహు :-** జనులందరూ పాపములో జీవిస్తుండగా, నోవహు మాత్రము దేవుడంటే భయభక్తులతో జీవించసాగాడు. దేవుడాతన్ని ఏర్పర్చుకొని, మూడంతస్తులు గల ఒక పెద్ద ఓడను తయారు చేయించాడు. అందులోకి ప్రతి జంతుజాతి, పక్షిజాతి, కీటకజాతి నుండి ఒక్కో జత చొప్పున ప్రవేశించాయి. నోవహు, ఆతని భార్య, ముగ్గురు కొడుకులు, ముగ్గురు

కోడళ్ళు అందులో ప్రవేశించారు. అంతకు ముందే ఆహారము సమకూర్చి ఓడలో నిల్వ చేశారు. దేవుడు తనహస్తము చాపి ఓడ తలుపును మూసి వేశాడు. నలువది దివారాత్రములు ఎడతెగకుండా కుండపోతగా వర్షము కురిపించాడు. భూమి (నేల) జలమయమై పర్వ తాలు మునిగిపోయాయి. ఓడ నీటిపై తేలియాడింది. భూమి పైనున్న సమస్త మానవకోటి, జంతుకోటి నాశనమై పోయా యి. నీరు ఇంకనారంభించి నూటఏబై రోజులలో పూర్తిగా ఇంకిపోయింది. ఓడ 'అరారాతు' పర్వతముపై ఆగింది. నోవహు కుటుంబము, సమస్త జంతువులు, పక్షులు, కీటకాలు ఓడనుండి బయటకు వచ్చి తిరిగి భూమిపై విస్తరించసాగాయి.

**బాబెలు గోపురము** :- నోవహు సంతానాన్ని నలుదిశల విస్తరించి వృద్ధి చెందమని దేవుడు ఆజ్ఞాపించాడు. కాని వారు ఒకే చోట ఉంటూ, ఒకే బాష మాట్లాడుతూ ఆకాశమందున్న దేవుని చెంతకు పోవాలని ఒక ఎత్తయిన గోపురాన్ని నిర్మించసాగారు. దేవుడు వారి మాటల్ని తారుమారు చేసి గోపుర నిర్మాణము చేయకుండా వారు నేల నాలుగు చెరగులా చెదరిపోయేటట్లు చేసాడు. మానవసంతతితో పాటు పాపముకూడా విశృంఖలముగా పెరగసాగింది. వారు దేవుని విస్మరించి పంచభూతాలను, సూర్య చంద్రులను, చెట్టు పుట్టలను పూజింపసాగారు.

**అబ్రహాము** :- హారాను దేశస్థుడైన అబ్రాము దేవుని దృష్టిలో మంచి నడవడిగలవాడు. ఆతన్ని దేవుడు ఏర్పర్చుకొని కనాను దేశమునకు తీసుకొని వచ్చాడు. కనాను దేశమును అబ్రాము సంతానాని కిచ్చి, వారిని తన ప్రజలుగా ఏర్పర్చుకొనుట దేవుని

ఉద్దేశము. అయితే నూరేళ్ళు నిండిన అబ్రామునకు, తొంబదేళ్ళు నిండిన ఆతని భార్య శారయికి సంతానములేదు. అంటే వారసుడు లేడు. ఆ వయస్సులో దేవుడు వారికొక కుమారుని ప్రసాదించాడు. ఆ కుమారుని పేరు 'ఇస్సాకు'. దేవుడు అబ్రాము పేరును 'అబ్రహాము' గాను శారయి పేరును 'శారా' గాను మార్చాడు.

ఇస్సాకు, తన పెదనాన్న నాహోరు మనవరాలు 'రిబ్కా' ను పెండ్లాడాడు. వీరికి మగ కవలలు జన్మించారు. పెద్దవాని పేరు ఏశావు, తండ్రి కిష్టుడు. చిన్నవాడు యాకోబు, తల్లి కిష్టుడు. యాకోబు తల్లి ప్రోద్బలముతో అన్నను మోసముచేసి, ఆతని జ్యేష్ఠత్వము, తండ్రి ఆశీర్వాదములు పరిగ్రహించాడు. అన్నకు భయపడి హారాను దేశములో నున్న మేనమామ లాబాను యొద్దకు పారి పోయాడు.

**యాకోబు** :- యాకోబు తనమేనమామ - లాబాను దగ్గర గొర్రెలను కాస్తుండేవాడు. లాబాను చిన్నకుమార్తె రాహేలును పెండ్లి చేసుకోవాలని కోరాడు. ఏడు సంవత్సరములు పని చేస్తే కూతుర్నిస్తానన్నాడు. ఏడేండ్లు పనిచేశాక పెళ్ళి ఏర్పాట్లు చేసి, రాత్రి పూట రాహేలు అక్క 'లేయా' ను యాకోబుకిచ్చి పెళ్ళి చేశాడు. ఇదేమిటి అని అడిగితే, పెద్దదానికి ముందుగా పెండ్లి చేయుట ఆచారమని, ఇంకో ఏడేళ్ళు పనిచేయడాని కొప్పుకుంటే చిన్నదాన్నిచ్చి పెండ్లి చేస్తానన్నాడు. దానికి అతడు ఒప్పుకోగా, వారమురోజుల తర్వాత రాహేలునిచ్చి పెండ్లి చేశాడు. ఒప్పందం ప్రకారము మరో యేడేండ్లు పని చేశాడు. అటుతర్వాత ఇంకో ఆరేళ్ళు మామదగ్గర పనిచేసి యాకోబు పశుసంపద, ధనధాన్యాలు, పనివారిని సమకూర్చుకొని దాసదాసీలతో సకుటుంబముగా కనాను

దేశమునకు బయలుదేరాడు. దారిలో అన్న ఏశావుతో సంధి చేసుకున్నాడు. అయిననూ అన్నకు భయపడి, తన సమస్త దాసదాసీలను, కుటుంబమును, పశువులను నది దాటించి ఒక్కడే ఈవల యొడ్డున ఒంటరిగా ఒక రాత్రి గడిపాడు. ఆ రాత్రి ఒక దేవదూత యాకోబుతో పోట్లాడి తొడపై గాయపరిచాడు. అయినా యాకోబు ఆ పోరాటములో ఓడిపోలేదు. అప్పుడు దేవుడు యాకోబు పేరును "ఇశ్రాయేలు"గా మార్చాడు. ఈ ఇశ్రాయేలు వంశస్తులే నేటి ఇశ్రాయేలీయులు (యూదులు). వీరే దేవుని జనాంగము.

యాకోబుకు లేయా ద్వారా ఆరుగురు కుమార్లు, ఒక కుమార్తె; లేయా దాసి 'జిల్పా' ద్వారా ఇద్దరు కుమారులు; రాహేలు దాసి "బిల్హా" ద్వారా ఇద్దరు కుమారులు; రాహేలు ద్వారా ఇద్దరు కుమారులు కలిగారు. రెండోకుమారుని కని రాహేలు చనిపోయింది. యాకోబు సంతానము అయిన ఈ పన్నెండుమంది కుమారులు ద్వారా ఇశ్రాయేలీయులు పన్నెండు గోత్రాలుగా వర్ధిల్లారు. రాహేలు కుమారుల పేర్లు యోసేపు, బెన్యామీను. యోసేపు గుణవంతుడు. తండ్రికి ప్రియమైనవాడు. అతనికి స్వప్న ఫలములు తెలిపే జ్ఞానము దేవుడిచ్చాడు. అందుకై పదిమంది అన్నలు అతని యెడల అసూయచెంది ఆతన్ని అంతమొందింప ఆలోచించారు.

**యోసేపు** :- దూర ప్రదేశములో గొఱ్ఱెలు మేపుచున్న పదిమంది అన్నల క్షేమసమాచారము తెలుసుకొని రమ్మని యాకోబు, యోసేపును పంపగా, వారతన్ని ఇరువది వెండిరూకలకు, ఆ త్రోవన వెళ్ళుచున్న వర్తకులగుంపుకు అమ్మివేశారు. కౄరమృగమొకటి యోసేపును చంపేసిందని తండ్రికి చెప్పారు.

వర్తకులగుంపు ఈజిప్ట్ దేశము వెళ్ళి, ఆ దేశపు రాజు 'ఫరో' వద్ద పనిచేస్తున్న "పోతీఫర్" అనే రాజోద్యోగికి, యోసేపును అమ్మివేశారు. యోసేపునుబట్టి దేవుడు పోతీఫర్ ఇంటిని ఆశీర్వదించాడు. ఒక రోజు పోతీఫర్ భార్య ఇంట్లో ఎవరూలేని సమయములో యోసేపును కామించి బలాత్కరించబోగా ఆమె చేతిలోనున్న తన పైవస్త్రము వదిలేసిపారిపోయాడు. భర్తకు కల్లబొల్లి మాటలు చెప్పి, యోసేపును చెఱసాలలో వేయించింది. అయితే చెఱసాల అధికారికి యోసేపు యెడల మంచి అభిప్రాయము కలిగి, మిగతా ఖైదీలపై యోసేపును పర్యవేక్షకుడుగా వుంచాడు. ఖైదీలలో ఇద్దరు రాజోద్యోగులు ఒకే రాత్రి రెండు విచిత్రమైన కలలు కన్నారు. వాటి అర్ధము వారికి యోసేపు తెలియజేశాడు. ఆ ప్రకారమే మూడు రోజుల్లో ఒకనికి తిరిగి తనఉద్యోగము దొరకగా, ఇంకొకడు ఉరితీయబడ్డాడు. తిరిగి ఉద్యోగములో చేర్చుకొనబడ్డవాడు రాజు యొక్క పానదాయకుడు.

**ఈజిప్ట్ రాజు ఫరో - యోసేపు** :- ఫరో ఒక రాత్రి రెండు విచిత్రమైన కలలుకన్నాడు. ఏడు బలిసిన ఆవులను, ఏడు బలహీన మైన ఆవులు తినేశాయి. ఏడు పుష్టిగల కంకులను, ఏడు బలహీనమైన కంకులు మింగేశాయి. వీటిఅర్ధము ఫరోకు ఎవరూ చెప్పలేక పోయారు. అప్పుడు ఫరోకు ఆయన దగ్గరున్న పానదాయకుడు, యోసేపు గురించి తెలియజేశాడు. వెంటనే ఫరో సముఖానికి యోసేపును రప్పించారు. యోసేపు తనకు దేవుడిచ్చిన జ్ఞానముతో కలల అర్ధము ఫరోకు తెలియజేశాడు. రెండు కలలు అర్ధము ఒక్కటే. ఏడు బలిసిన ఆవులు, ఏడు పుష్టి గల కంకులు, ఏడు సమృద్ధి

సంవత్సరాలు. ఏడు బక్కచిక్కిన ఆవులు, ఏడు బలహీనమైన కంకులు, ఏడు కరువు సంవత్సరాలకు సూచన. కావున సమృద్ధిగా పండే సంవత్సరాలలో ప్రతి రైతు యొద్దనుండి ఐదవ వంతు పంట వసూలు చేసి, ఆయా పట్టణాలలో, ఆయా గ్రామాలలో కొట్లు కట్టించి నిల్వ చేయాలని, తర్వాత వచ్చే కరువు సంవత్సరాలలో ప్రజలకు అలా నిల్వ చేసిన ఆహారధాన్యాలు పంపిణీ చేయాలని సలహా ఇచ్చాడు. నీవే ఈ పనికి సమర్థుడవని చెప్పి, ఫరో యోసేపును తన దేశములో తన తర్వాతి హోదాలో నియమించాడు.

ఫరో అప్పగించిన పని సమర్థవంతముగా నెరవేర్చి యోసేపు అందరి అభిమానము చూరగొన్నాడు. ఫరో, యోసేపుకు ఒక మంచి వధువును ఎంపిక చేసి, ఆమెతో పెండ్లి చేశాడు.

**యోసేపు అన్నల ఈజిప్ట్ రాక** :- కరువు ఈజిప్ట్ చుట్టూ ఉన్న దేశములలో కూడా వచ్చింది. కనానుదేశములో కూడా కరువే. ఆహారధాన్యాలు కొనుగోలు చేయుటకు యోసేపు పదిమంది అన్నలు ఈజిప్ట్ దేశానికి వచ్చి యోసేపును కలిశారు. యోసేపు వారు తన అన్నలని పోల్చుకున్నాడు, కానీ వారు తమ తమ్ముణ్ని గుర్తు పట్టలేదు. వారిని అనేక ప్రశ్నలు వేసి తికమక పెట్టి, వారిలో ఒకన్ని బందీగా చేసి ఆహారధాన్యాలు ఇచ్చి, ఇంకొకసారి వచ్చినప్పుడు వారి ఆఖరి తమ్ముడైన బెన్యామీను (తన తోబుట్టువు) ను కూడా తెస్తేగాని ఆహారధాన్యాలు ఇవ్వనని, బందీగావున్నవాడిని విడచి పెట్టనని పంపించాడు. మరోసారి వారు తమ ఆఖరి తమ్ముణ్ని వెంట బెట్టుకొని వచ్చారు. ఈసారి వారిని మరికొంత తికమక పరచి, ఆఖరికి తనెవరో చెప్పాడు. వారు యోసేపును గుర్తించి భయపడ్డారు. కానీ

యోసేపు వారితో ప్రేమాభిమానముగా మాట్లాడి కరువునుండి తప్పించు కొనుటకు, వారంతా కనాను దేశము నుండి, తండ్రితో సహా, అందరూ సపరివారముగా దాసదాసీలతో, ఆస్తులతో, పశువులతో. ఈజిప్ట్ దేశానికి రావలిసినదిగా కోరాడు. ఫరోరాజు కూడా యోసేపు కోరికను మన్నించి వారికి సకల సదుపాయాలు కలుగజేసి, బండ్లలో ఆహారధాన్యాలతో వారిని పంపించాడు.

**యాకోబు (ఇశ్రాయేలు) ఈజిప్ట్ దేశాగమనము** :- యోసేపు బ్రతికే వున్నాడని, ఆనందముతో, యాకోబు దేవునికి బలులర్పించాడు. నీవు ఈజిప్ట్ వెళ్ళు, అక్కడ నీ సంతానము, వంశము అభివృద్ధి చెందు తుందని దేవుడు యాకోబుతో చెప్పాడు, యాకోబు. తన కుమారుల కుటుంబములు, దాసదాసీ జనులు, పశు సంపద, ధనము ఆస్తులతో కూడా బయలుదేరి ఈజిప్ట్ దేశమును చేరుకున్నాడు. యోసేపును కౌగిలించుకొని యాకోబు బహుగా ఆనందించాడు. ఫరోరాజు కూడా వారందరిని ఆదరించి వారిష్టమున్న చోట, తన దేశములో స్థిరపడవచ్చునని తెలిపాడు. ఈజిప్ట్లోనున్న గోషెను ప్రాంతములో వారు స్థిరపడ్డారు. ఈజిప్ట్లో యాకోబు పదిహేడు సంవత్సరములు జీవించి చనిపోయాడు.

**ఇశ్రాయేలీయుల అభివృద్ధి - దాసత్వము** :- ఆలాగున ఈజిప్ట్లో స్థిరపడిన ఇశ్రాయేలీయులు దినదినాభివృద్ధి చెంది తమ సంఖ్యను పెంచుకోసాగారు. కాలక్రమమున వచ్చిన ఈజిప్ట్ రాజులు వీరిని నిరాదరించారు. ఈజిప్ట్ ప్రజలు వీరిని చిన్నచూపుచూశారు. వారితో దాసత్వము చేయించు కున్నారు. వారిని కష్టాలకు గురిచేస్తూ హింసించారు. ఏ తప్పుచేసినా మరణశిక్ష విధించేవారు. ఈజప్ట

వారు ఇశ్రాయేలీయున్ని చంపుతే వారికి శిక్షలేదు. ఇశ్రాయేలీయుల జనాభా అరికట్టుటకు ఫరో ఒక భయంకరమైన శాసనము చేశాడు. వారికి పుట్టిన మగపిల్లలను పురిట్లోనే చంపేయాలి. నాలుగు వందల సంవత్సరాలు గడిచాయి. దేవుడు వారి యెడల కనికరపడి, వారిని ఈజిప్ట్ దాసత్వము నుండి తప్పించి, కనాను దేశానికి చేర్చాలని నిర్ణయించాడు. అందుకై వారిలో నుండే ఒక ప్రవక్తను, నాయకునిగా ఎన్నుకొన్నాడు, అతని పేరు మోషే.

**మోషే** :- ఓ కుటుంబములో పుట్టిన మగబిడ్డను చంపలేక, ఒక జమ్ముపెట్టెలో పెట్టి నైలునదిలో వదిలి వేశారు. నదీస్నానానికి వచ్చిన ఫరోకుమార్తె ఆ జమ్ముపెట్టెను కనుగొని అందులో నున్న చక్కని బిడ్డను చూచి, మోషే అను పేరు పెట్టి, తనే ఆ బిడ్డను పెంచుకోసాగింది. ఆ విధముగా మోషే రాజభోగములననుభవిస్తూ రాచవిద్యలను నేర్చుకున్నాడు. అయితే తాను హెబ్రీయుడు (ఇశ్రాయేలీయుడు) నని ఆతనికి తెలుసు. తన యౌవనములో ఇశ్రాయేలీయున్ని హింసిస్తున్న ఒక ఈజిప్ట్ దేశస్తున్ని చంపి, ఫరో దండిస్తాడని భయపడి పారిపోయి మిద్యాను దేశము చేరాడు. అక్కడ ఒక స్త్రీని పెండ్లి చేసుకొని గొఱ్ఱెలు మేపుకోసాగాడు. ఒకరోజు "హోరేబు" కొండపై ఒక పొద మండుచుండుట చూచాడు. కానీ పొద కాలుటలేదు. ఒకస్వరము విన్నాడు – "ఇది పరిశుద్ధ స్థలము. నీ చెప్పులు విడిచిపెట్టి, దగ్గరకు రా" అని. మోషే చెప్పులు విడిచి పొద వద్దకు వెళ్ళాడు. "నీవు ఇశ్రాయేలీయులకు నాయకుడిగావుండి, ఈజిప్ట్ దేశమునుండి వారిని విడిపించి నేను అబ్రాహామునకు వాగ్ధానము చేసిన కనాను దేశమునకు తీసికెళ్ళు" అని ఆ స్వరము

చెప్పింది. కొంత సంభాషణ జరిగాక "నీ వెవరివి" అని మోషే అడిగాడు. **"నేను ఉన్నవాడను"** అని దేవుడు చెప్పాడు. హెబ్రీ భాషలో దేవున్ని **"యెహోవా"** అంటారు.

**ఇశ్రాయేలీయుల విడుదల** :– తన అన్న అయిన అహరోనుతో కలిసి, మోషే ఫరోయొద్దకు వెళ్ళి ఇశ్రాయేలీయులను తనతో పంపించేయమని అడిగాడు. ఫరో ఒప్పుకోలేదు. అప్పుడు దేవుడు మోషే, అహరోనుల ద్వారా వరసగా పది తెగుళ్ళు ఈజిప్ట్ దేశము మీదకు పంపించాడు. అయినా ఫరో లొంగలేదు. ఆఖరికి దేవుడు కోపించి, ఫరో మొదలు కొని చెఱసాలలోనున్న ఖైదీ వరకు మొత్తం ఈజిప్ట్ ప్రజలందరి ఇండ్లలో ప్రధమ సంతానాన్ని హతముచేశాడు. వారిలో మహాఘోష పుట్టింది. అప్పుడు ఫరో ఇశ్రాయేలీయులను పోనిచ్చాడు. ఇశ్రాయేలీయులకు భయపడిన ఈజిప్టీయులు - వారు అడిగిన వెంటనే తమకున్న వెండి బంగారములు. విలువైన వస్తువులు వారికి ఇచ్చేశారు. అవి తీసుకొని సుమారుగా ముప్పదిలక్షలమంది ఇశ్రాయేలీయులు మోషే వెంట అరణ్యమార్గము గుండా ఎఱ్ఱసముద్రమువద్దకు చేరారు. అయితే ఫరో మనసు మార్చుకొని, ఇశ్రాయేలీయులను బంధించి తెచ్చుటకు సైన్యములను పంపించాడు. దేవుడు ఆజ్ఞఇయ్యగా మోషే ఎఱ్ఱసముద్రముపై తన చేతి కర్రను చాపాడు. సముద్రము రెండుగా చీలిపోయి త్రోవ ఏర్పడ్డాది. ఇశ్రాయేలీయులు ఆ మార్గముగుండా దాటిపోయి ఆవలి ఒడ్డుకు చేరారు. ఈలోగా ఈజిప్ట్ సైన్యాలు మార్గములో సముద్రము మధ్యకు వచ్చారు. దేవుని ఆజ్ఞప్రకారము మోషే తిరిగి సముద్రముపై తన కర్రచాపగా సముద్రపు రెండుపాయలు కలిసిపోయి ఫరో సేనలను ముంచి వేసింది.

**ఇశ్రాయేలీయుల ప్రయాణము :-** ముప్పది లక్షల ఇశ్రాయేలు ప్రజలను, మజిలీలుగా అరణ్యము గుండా, ఎడారి గుండా, నలువది సంవత్సరముల పాటు మోషే, అహరోనుల నాయకత్వములో దేవుడు కనాను దేశమువైపు నడిపించాడు. వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా, ఆహారపానీయాలు అమర్చుతూ, వస్త్రములు పాడవకుండా, చెప్పులు అరగకుండా, పగటిపూట ఎండతగలకుండా మబ్బును, రాత్రిపూట చలివేయకుండా అగ్నిస్తంభమును ఏర్పాటు చేస్తూ నడిపించాడు. దేవుడు సీనాయి పర్వతముపైకి మోషేను పిలిపించి, పది ఆజ్ఞలను, తన ప్రజలైన ఇశ్రాయేలీయులకు ఇచ్చాడు. అవేమనగా:-

1) నేనొక్కడినే దేవుడను.
2) విగ్రహారాధన చేయకూడదు.
3) నా నామమును వ్యర్థముగా వుచ్చరించకూడదు.
4) విశ్రాంతిదినమును ఆచరించాలి.
5) తల్లిదండ్రులను సన్మానించాలి.
6) నరహత్య చేయకూడదు.
7) వ్యభిచరించ కూడదు.
8) దొంగతనము చేయకూడదు.
9) అబద్ధసాక్ష్యము పలుకకూడదు.
10) పొరుగువాడి భార్యనుగాని, ఆతని ఆస్తిపాస్తులనుగాని ఆశించకూడదు.

మరియు దేవునికి జంతుబలులు ఏవిధముగా అర్పించాలి, కుటుంబ వ్యవస్థ ఏలాగుండాలి, దేవున్ని ఏలాగు ఆరాధించాలి

మొదలైన విషయాలపై, మరియు పది ఆజ్ఞలకు కట్టడలు, విధులతో కూడిన వివరణతో "ధర్మశాస్త్రము"ను తన ప్రజలైన ఇశ్రాయేలీయులకు మోషే ద్వారా దేవుడనుగ్రహించాడు.

మోషే చేసిన ఒక పొరపాటువలన ఆతడు కనాను దేశములోనికి ప్రవేశించకుండా దేవుడు నిషేదించాడు. అటు తర్వాత "యెహోషువా" అను నాయకుని ద్వారా కనానుదేశములో నున్న వేరే తెగలవారిని యుద్ధములో ఓడించి, ఇశ్రాయేలీయులు కనానుదేశములో చాలా ప్రాంతాలను ఆక్రమించు కొనేటట్లు దేవుడు చేశాడు. కనాను దేశమునకు - "పాలస్తీనా" దేశమని కూడా పేరు. ఈ పాలస్తీనీయులు నిరంతరము ఇశ్రాయేలీయులతో యుద్ధము చేసెడివారు. (ఇప్పటికీ చేస్తూనే ఉన్నారు).

**న్యాయాధిపతులు** :- ఇశ్రాయేలు ప్రజలను ఏలుటకు యెహోషువ తర్వాత సుమారు మూడువందలు సంవత్సరాల వరకు దేవుడు న్యాయాధిపతులను నియమించాడు. అందులో స్త్రీలు కూడా వున్నారు న్యాయాధిపతులలో ప్రముఖులు-గిడియన్, శాంసన్, యెఫ్తా. న్యాయాధిపతులుంటుండగా కూడా, ఇశ్రాయేలు ప్రజలు దేవునికి వ్యతిరేకముగా పాపము చేసేవారు. ముఖ్యముగా, విగ్రహారాధన చేసేవారు. ఈ మూడువందల సంవత్సరములలో న్యాయాధిపతికి, న్యాయాధిపతికి మధ్యనున్న కాలములలో మొత్తం నూటాపది సంవత్సరముల పాటు, దేవుడు వారిపై కోపించి వేరేవారి క్రింద దాసత్వము చేయించాడు. న్యాయాధిపతుల తర్వాత కొంత కాలము ఇశ్రాయేలీయులు నాయకత్వము లేకుండా తమ ఇష్టానుసారము జీవింపసాగారు.

**రాజుల పాలన :**-న్యాయాధిపతుల పర్వము ముగియగానే దేవుడు సమూయేలను మంచి యాజకుని ద్వారా, ఆయన కుమారులద్వారా ఇశ్రాయేలీయులను పాలించాడు. దేవుని ఆజ్ఞచొప్పున ప్రజల కోరిక మేరకు సమూయేలు బెన్యామీను గోత్రీకుడైన **"సౌలు"**ను రాజుగా అభి షేకించాడు. ఇతడు ఇశ్రాయేలీయులను నలువది సంవత్సరములు పాలించాడు. ఇతడు తన యిష్టానుసారముగా ప్రవర్తించి దేవుని దృష్ఠిలో చెడునడత నడిచాడు. అప్పుడు దేవుడు ఆజ్ఞ ఇవ్వగా సమూయేలు "దావీదు" అనే యూదాగోత్రీకుని రాజుగా అభిషేకించాడు.

**దావీదు** :- ఈతడు బహుసుందరుడు. దేవునికి ఇష్టుడు. మంచి నడవడి గలవాడు. ఈతడు యుద్ధములో, పాలస్తీనీయుల వీరుడును, మంచి పొడగరి, బలిష్టుడైన **'గొల్యాతు'** ను వడిశెల రాయితో పడగొట్టి చంపాడు. దావీదు తనకంటే గొప్పవాడవుతాడేమోనని అనుకొని సౌలు దావీదుని చంపాలను కున్నాడు. దావీదు దూరముగా పారి పోయాడు. సౌలురాజు ఒక యుద్ధములో చనిపోగా ఏడు సంవత్స రములు ఇశ్రాయేలీయులకు రాజు లేదు. దావీదు" హెబ్రోను" లోనుండి రాజ్యమంత్రాంగము నడిపాడు అప్పుడు ప్రజలు దావీదును రాజుగా వుండమని కోరారు. దావీదు పట్టాభిషిక్తుడై ముప్పదిమూడు సంవత్సరములు ఇశ్రాయేలీయులను ఏలాడు. తన యేలుబడిలో రాజ్యాన్ని సుస్థిరపరిచాడు. చుట్టు ప్రక్కలనున్న రాజులతో శాంతి సమాధాన సంబంధాలు నెలకొల్పాడు. యెరుష లేములో దేవుని మందిరము కట్టుటకు సమస్తము సిద్ధపరిచాడు. దావీదు మహారాజుగా పరిగణింప బడినాడు. అయినా దావీదు తన

యేలుబడిలో యుద్ధములుచేస్తూ తనహస్తములు రక్తసిక్తము గావించుకున్నాడు, కాబట్టి దావీదు తనకొరకై మందిరము కట్టుటకు దేవుడు అనుమతించలేదు. దావీదు మహారాజు గొప్పగాయకుడు. అనేకమైన కీర్తనలు వ్రాసి, పాడి దేవుని ఆరాధించాడు. బైబిల్‌లోనున్న కీర్తనల గ్రంథములో ఇవన్నీ పొందుపరచబడియున్నవి.

**సొలోమోను** :- ఈతడు దావీదు కుమారుడు. సౌందర్యవంతుడు. దేవుడీతనికి అపారజ్ఞాన మిచ్చాడు. ఈతడు ఇశ్రాయేలీయులను నలువది సంవత్సరములు పాలించాడు. ఈతడు యెరుషలేములో దేవునికి మందిరము కట్టించాడు. దేశదేశాలు నుండి ప్రముఖులు సొలోమోను మహరాజును దర్శించి ఆయన జ్ఞానానికి అబ్బురపడే వారు. ఇంత గొప్ప జ్ఞాని, స్త్రీలోలుడై ఏడువందల మంది భార్యలను, మూడువందల మంది ఉపపత్నులను ఏర్పర్చుకున్నాడు. ఈతని భార్యలలో ఒకామె ఫరోకుమార్తె. వీరిలో చాలామంది విగ్రహారా ధికులు. వీరినిబట్టి సొలోమోను మహారాజు ఆఖరికి విగ్రహారా ధికుడై దేవుని కోపానికి గురైనాడు. సొలోమోను విరచిత సామెతలు గ్రంథము, వేదాంత శాస్త్రము (ప్రసంగి) ప్రేమగీతము (పరమ గీతము) బైబిల్‌లో వున్నాయి.

**తర్వాతి రాజులు** :- సొలోమోను చేసిన పాపానికి దేవుడు కోపించి ఇశ్రాయేలు దేశాన్ని రెండు ముక్కలు చేశాడు. పది గోత్రాల ప్రజలను ఇశ్రాయేలుదేశముగా, రెండు గోత్రాలు - యూదా, బెన్యామీను- వారిని యూదాదేశముగా విభజించాడు. సొలోమోను కుమారుడు రెహబాము యూదాదేశానికి రాజు. యరోబాము ఇశ్రాయేలుదేశానికి రాజయ్యాడు.

## ఇశ్రాయేలీయుల చెర :-

**ఇశ్రాయేలు రాజులు**: -వీరు షోమ్రోను పట్టణమును రాజధానిగా చేసుకొని పాలన సాగించిరి. సుమారుగా పంతొమ్మిది మంది రాజులు రెండువందల సంవత్సరములు పాలించారు. వీరందరూ దుష్టప్రవర్తన గలిగినవారు. దేవుడు, ఏలీయా, ఎలీషా అను దీర్ఘదర్శులద్వారా వారిని హెచ్చరించిననూ వారు మారలేదు. ప్రజలు కూడా విగ్రహపూజ చేస్తూ విచ్చలవిడిగా బ్రతికారు. దేవుడు అష్షూరు రాజును ప్రేరేపించి వీరి దేశమును నాశనము చేసి, మొత్తము ప్రజలందరినీ బందీలుగా తీసుకొని పోయేటట్లు చేశాడు. ఈ బందీలందరూ బానిసలుగా ప్రపంచ నలుమూలలా చెదరగొట్టబడ్డారు. ఈ పది గోత్రాలు తప్పిపోయిన గోత్రాలుగా నేటికీ పిలువబడుచున్నారు. (వీరిలో కొందరు భారతదేశములో కూడా చెదరియున్నారని పరిశోధకుల అభిప్రాయము)

**యూదారాజులు** :- పంతొమ్మిది మంది రాజులు సుమారుగా మూడువందల సంవత్సరాలు యూదారాజ్యాన్ని పాలించారు. వీరిలో కొంతమంది దేవునిదృష్టికి మంచివారు. కొంతమంది చెడునడవడి గలవారు. అలాగే రాజులనుబట్టి ప్రజలుకూడా చెడు తనము జరిగించగా, దేవుడు వీరిని కూడా అష్షూరురాజు చేతికి అప్పగించాడు. యూదాదేశము అష్షూరురాజ్యములో భాగమయ్యింది. ఈజిప్ట్‌రాజు అష్షూరుదేశమును జయించి తనరాజ్యములో కలుపుకొనగా, యూదా రాజ్యం ఈజిప్ట్‌లో భాగమయ్యింది. ఆతర్వాత బాబిలోనురాజు ఈజిప్ట్‌ను జయించాడు. బాబిలోనురాజైన నెబూకద్నెజరు యూదారాజ్యమును నాశనము చేసి యెరూషలేము

మందిరములో నున్న వెండి, బంగారు వస్తువులను దోచుకొని, మందిరమును నేలమట్టముచేసి, ప్రజలందరినీ బందీలుగాచేసి బాబిలోనుకు తీసుకుపోయాడు. అటుతర్వాత పారశీకులు బాబిలోను రాజ్యమును జయించారు. పారసీకులరాజు యూదాప్రజలను మిత్రులుగా ఆదరించాడు. ఈ యూదాప్రజలు సుమారుగా డెబ్బది సంవత్సరములు దాసత్వము చేశారు. ఈ కాలములోనే రాజాజ్ఞాను సారము దేశమంతటా విగ్రహారాధన ప్రబలివుంది. డేనియల్, షడ్రక్, మెషక్, అబెద్నగో అను దైవభక్తులు ఈ విగ్రహారాధనను ఖండించారు. తనఆజ్ఞనే ధిక్కరించిన వీరిపై రాజు కోపించి మరణదండన విధించాడు. అయితే అద్భుతరీతిలో దేవుడు వీరిని అగ్నిగుండము నుండి, సింహపు బోనులో నుండి అందరూ చూస్తుండగానే తప్పించాడు. తద్వారా దేవుడు జీవముగలవాడని, నిర్జీవమైన విగ్రహము కాదని లోకానికి చాటి చెప్పారు. ఈ విధముగా యూదులు విగ్రహారాధన పూర్తిగా మానివేశారు.

**యెరుషలేము మందిరము, పట్టణము తిరిగి కట్టబడుట** :- డెబ్బది సంవత్సరముల దాసత్వము తర్వాత పారశీక రాజులు యూదా ప్రజలకు (యూదులు) వారి దేశానికి వెళ్ళుటకు అనుమతి ఇచ్చారు. ధనసహాయము చేశారు. యూదుల పెద్దలైన యేషూవ, జెరు బ్బాబెలు, ఎజ్రా, నెహెమ్యా అనువారి నాయకత్వంలో యెరుషలేము పట్టణము, దేవునిమందిరము తిరిగి కట్టబడ్డాయి.

ఇశ్రాయేలురాజులు, యూదారాజులు పరిపాలించిన సమయములోను, పరరాజుల క్రింద బానిసలుగా నున్నప్పుడు, దేవుడు యెషయా, యిర్మియా, యెహెజ్కేలు, దానియేలు, హోషేయ,

యావేలు, ఆమోసు, ఓబద్యా, యోనా, మీకా, నహూము, హబక్కూకు, జఫన్యా, హగ్గయి, జకర్యా, మలాకీ అను ప్రవక్తల ద్వారా ఇశ్రాయేలు ప్రజలకు, వారి రాజులకు, కల్దీయ, పారశీక, మాదీయరాజులకు హెచ్చరికలు చేస్తూండేవాడు. దేవుడు తన సందేశము తన జనాంగముద్వారా ప్రపంచానికి తెలియజేశాడు.

కల్దీయులు, మాదీయులు, పారశీకులు, గ్రీకులు, రోమణులు కాలక్రమేణ వారి సామ్రాజ్యములు స్థాపించి ప్రపంచాన్ని పాలించారు. ఈ సామ్రాజ్యముల అవతరణకు ముందే వాటి ఉత్థానపతనముల గురించి దేవుడు తన ప్రవక్తల ద్వారా తెలియజేసాడు. ఆయా దేశ కాల మాన పరిస్థితులు, సామాజిక జీవనము, భౌగోళిక అంశములు, ఖగోళ రహస్యములు, వైజ్ఞానిక విషయములు, దేవుడు చేసిన అద్భుతకార్యములు, ధర్మశాస్త్రము మొదలైనవి చారిత్రక ఆధారములతో సహా సమగ్రముగా బైబిల్‌లో పొందుపరచబడియున్నవి.

ప్రవక్తలు రాబోవు రోజులలో దేవుడు చేయబోవు కార్యముల గురించి తెలియజేశారు. యేసుక్రీస్తు పుట్టుక, మరణము గురించి, ఇజ్రాయేలీయుల భవిష్యత్తు గురించి, ప్రవచించారు. ఆవిధముగానే వారి ప్రవచనములు నెరవేరాయి. ఇంకా నెరవేరు తున్నాయి. దీనికి నిదర్శనము నేటి ఇశ్రాయేలు దేశ ఆవిర్భావము, ఆ పైని జరిగిన సంగతులు.

**యేసుక్రీస్తు జనన, మరణ, పునరుత్థానముల గురించి తన ప్రవక్తల ద్వారా దేవుడీలాగు తెలియజేశాడు.**

**జన్మము :–** "ఆలకించుడి. కన్యక గర్భవతియై కుమారునికని

అతనికి "ఇమ్మానుయేలు" అని పేరు పెట్టును"

(ఇమ్మానుయేలు = దేవుడు మనకు తోడైయున్నాడు)

"ఏలయనగా మనకు శిశువు పుట్టెను. మనకు కుమారుడను గ్రహింప బడెను"

( కుమారుడు = (కు) పాపము (మారుడు ) హరించువాడు)

**మరణము :-** "మన అతిక్రమక్రియలను బట్టి అతడు గాయ పరచబడెను. మన దోషములను బట్టి నలుగ గొట్టబడెను. మన సమాధానార్థమైన శిక్ష అతని మీదపడెను. అతడు పొందిన దెబ్బల చేత మనకు స్వస్థత కలుగుచున్నది. యెహోవా మన అందరి దోషము అతని మీద మోపెను. అన్యాయపు తీర్పు నొందినవాడై మరణమునకు అప్పగింపబడెను. మౌనముగా అతడా శిక్షననుభవించెను".

(సర్వమానవుల పాపప్రాయశ్చిత్తము కొరకు యేసుక్రీస్తు బలియై రక్తము చిందిస్తాడు)

**పునరుత్థానము**:- " ఓ మరణమా! నీ ముల్లెక్కడ?, ఓ మరణమా! నీ విజయమెక్కడ?"

(మానవులందరి తరపున యేసుక్రీస్తు మరణమును జయిస్తాడు)

ఆఖరి ప్రవక్త మలాకీ నుండి యేసుప్రభువు పుట్టినవరకు మధ్యనవున్న సమయము నాలుగు వందల యేండ్లు. ఈ సమయంలో రాజ్యాలు చేతులు మారాయి. గ్రీకులు, రోమనులు రాజ్యధికారానికి వచ్చారు. ప్రజల ప్రవర్తనలో మార్పులేదు. వారి జీవితాలు మారలేదు. పాపము చేయుచునే ఉన్నారు.

దేవునితో మానవుని సత్సంబంధము తిరిగి నెలకొనుటకు ఒక మధ్యవర్తి కావాలి. ఆ మధ్యవర్తి యేసుక్రీస్తే.

# క్రీస్తు శకము - క్రొత్త నిబంధన

## దేవుని ప్రణాళికలో మానవుని రక్షణ.

ఆదాము హవ్వల ద్వారా మానవునికి జన్మపాపము సంక్రమించింది. తన కర్మపాపము ద్వారా, ఈపాపరాశి పెరుగుతూనే వున్నది. బలియాగము ద్వారా జంతురక్తమును చిందించి, మానవుడు పాపపరిహారము పొందగలడు అనేది ఆనాదిగా వున్న ఒక నమ్మకము. ఈ పక్షిబలి, జంతుబలి, నరబలి అనునది ప్రపంచమంతటా ప్రతి మానవజాతిలోను ప్రబలియున్నవి. మానవుడు నశించకూడదని దేవుని కోరిక. నరుడు పాపము చేయకుండా వుండలేడు. పాపానికి శిక్ష మరణము. నరుని పాపానికి ప్రాయశ్చితము కావాలి. అందుకే సర్వమానవాళికి వారి పాపమునుండి వారిని రక్షించుటకు పరిశుద్ధుడొకడు బలియాగము గావించ బడాలి. దేవుడొక్కడే పరిశుద్ధుడు. కావున దేవుడే "మనుష్యకుమారుని" అవతారమెత్తి, బలియై రక్తము చిందించాలి. ఇదే దేవుని ప్రణాళిక. ఆ నరావతారి ప్రభువైన యేసుక్రీస్తు.

**యేసుక్రీస్తు జన్మము:-** రోమా చక్రవర్తి సీజర్ అగస్టస్ పరిపాలన చేసే కాలములో, పరిశుద్ధాత్మ వలన గర్భవతియైన కన్య మరియ, బెత్లెహేమను యూరిలో ఒక పశువులశాలలో యేసుక్రీస్తుకు జన్మనిచ్చింది. యేసుక్రీస్తు అనే పేరు దేవుడే పెట్టాడు.

**అర్థము:**

**యేసు** =రక్షకుడు (పాపము నుండి నరులను రక్షించేవాడు)

**క్రీస్తు** = అభిషిక్తుడు = రాజు = ఏలిక

దేవదూతలు యేసుప్రభువు పుట్టుక గురించి పొలములోనున్న గొర్రెల కాపరులకు తెలియజేశారు.

"ప్రజలందరికీ కలగబోవు మహా సంతోషకరమైన సువర్తమానం నేను మీకు తెలియజేయుచున్నాను. దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడు. ఈయన ప్రభువైన క్రీస్తు". ఆ తరువాత దేవదూతల సమూహం "సర్వోన్నతమైన స్థలములో దేవునికి మహిమయు, ఆయనకి కిష్టులైన మనుషులకు భూమిమీద సమాధానం కలుగునుగాక" అని పాడారు. గొర్రెల కాపరులు బెత్లెహేము వెళ్ళి పశువుల తొట్టెలో పరుండబెట్టియున్న శిశువైన యేసుని చూసి పూజించారు. ఈ విషయము ఊరిలో అందరికి తెలియజేశారు.

తూర్పు దిక్కున ఒక నక్షత్రం ఉదయించింది. దానిని కనుగొన్న తూర్పుదేశపు జ్ఞానులు (ఖగోళ శాస్త్రజ్ఞులు) దానివెంట ప్రయాణించి, బెత్లెహేము వెళ్ళి, శిశువైన యేసుని కనుగొని సాగిలపడి పూజించారు. బంగారము, సాంబ్రాణి, బోళము కానుకలుగా సమర్పించుకొన్నారు. (ఇందులో ఒక జ్ఞాని, భారతదేశమునుండి వెళ్ళాడని పరిశోధకుల అభిప్రాయము)

రోమా ప్రభుత్వ ప్రతినిధిగా యూదాదేశాన్ని పరిపాలిస్తున్న హేరోదురాజు జ్ఞానులద్వారా యూదులకు రాజు పుట్టాడని తెలుసుకొని, తన అధికారము పోతుందని భయపడి, యేసుక్రీస్తుని చంపాలని ఆలోచించాడు. దేశంలో రెండేళ్ళలోపునున్న మగశిశువులందరిని చంపించాడు. దేవునిదూత హెచ్చరించగా యోసేపు-మరియను, శిశువైన యేసుక్రీస్తుని ఈజిప్టుదేశానికి

తీసుకుపోగా, దుర్మార్గుడైన హేరోదు మరణించేవరకు వారు అక్కడే నివసించారు.

యేసుక్రీస్తుకు పన్నెండేళ్ళు నిండగా, తల్లిదండ్రులు ఆతన్ని యెరూషలేములోనున్న దేవుని మందిరానికి తీసుకొని వెళ్ళారు. అక్కడవున్న తలపండిన మతపెద్దలతో దేవుని గురించి, ధర్మశాస్త్రం గురించి బాలుడైన యేసు తర్కించాడు. ఆతని జ్ఞానానికి వారు అబ్బురపడ్డారు.

ఆ తరువాత తనకు ముప్పదియేండ్లు నిండేవరకు తల్లిదండ్రులకు విధేయుడుగా ఉండి, తండ్రి వృత్తి అయిన వడ్రంగి పనిలో ఆతనికి సహాయపడ్డాడు. ముప్పదియేండ్లు నిండాక బాప్తిసమిచ్చే యోహాను ద్వారా యోర్దాను నదిలో ముంచడము (బాప్తిసము) పొందగా, పరిశుద్ధాత్మదేవుడు యేసుక్రీస్తు పైకి వచ్చాడు. అప్పుడు ఆయన అరణ్యములోకి పోయి నలువది దినములు ఉపవాసం ఉండి దేవుని(తండ్రి) సహవాసములో గడిపాడు. ఆ సమయములో సైతాను యేసుప్రభువునే శోధించింది. సైతానుని యేసుప్రభువు గద్దించగా అతడు విడచిపోయాడు. ఆ తరువాత మూడున్నరయేండ్లు యేసుప్రభువు తన బోధను, పరిచర్యను కొనసాగించాడు.

యేసు ప్రభువు పన్నెండుమంది శిష్యులను ఏర్పరచుకొని ఇశ్రాయేలు దేశమంతా తిరిగి దేవుని వాక్యమును ప్రకటించాడు. అధికార స్వరముతో ఆయన చేసిన బోధలను విని ప్రజలు యేసుని వెంబడించసాగారు. యేసుక్రీస్తు అనేక అద్భుతకార్యములు చేసాడు. రోగులను స్వస్థ పరిచాడు, గ్రుడ్డివారికి చూపు నిచ్చాడు, చెవిటి

వారు వినగలిగారు, కుంటివారు నడిచారు, దయ్యాలను వెళ్ళగొట్టాడు, చనిపోయిన వారిని బ్రతికించాడు, ఐదురొట్టెలు రెండు చేపలతో వేలమందికి ఆహారం పెట్టాడు, సముద్రపు కెరటాలపై నడిచాడు, తుఫానుని గద్దించగా సముద్రము నిమ్మళమయింది. పాపులను క్షమించాడు.

ప్రజలకు అర్థమైన రీతిలో చిన్న చిన్న ఉపమానములతో బోధించాడు. మతగురువుల లోపాలను ఎత్తిచూపి దిద్దుకోమని హెచ్చరించాడు.

యేసు ప్రభువు చేసిన ముఖ్యమైన బోధనలు :

1. శత్రువుని ప్రేమించు, పొరుగువానిని ప్రేమించు.
2. పగ, ప్రతీకారము చేయకు. ఒక చెంపపై కొడితే రెండో చెంప చూపించు.
3. దూషించేవానిని దీవించు. వాని యెడల సహనముతో మెలగు.
4. బీదలను అనాథలను ఆదరించు. రోగులను ఆదరించి, వారికి సేవ చేయు.
5. ధనాపేక్ష కలిగియుండకు.
6. నీకున్న సంపద ఇతరుల శ్రేయస్సు కొరకై వెచ్చించు.
7. మతాచారములు మానవ సేవకు అడ్డురాకూడదు.
8. నిన్ను నీవు తగ్గించుకొని వినయముగా ఉండు.
9. చెడుని ఖండించి నీతిమయముగా జీవించు
10. నీ మాట అవునంటే అవును, కాదంటే కాదు అని ఉండాలి.

మరియు దేవుడిచ్చిన పది ఆజ్ఞలను యేసుప్రభువు కుదించి రెండు ఆజ్ఞలుగా ప్రజలకిచ్చాడు.

1. **దేవున్ని ప్రేమించి, ఆత్మతోను సత్యముతోను ఆరాధించాలి.**
   (పరిశుద్ధాత్మప్రేరణతో, సువార్త సత్యముతో).

2. **నిన్ను వలె నీ పొరుగువానిని ప్రేమించు. ఇతరులు నీకేమి చేయాలని నీవనుకుంటావో అలాగునే ఇతరులకు చేయు.**
   ( ఈ రెండు ఆజ్ఞలలో పది ఆజ్ఞలు ఇమిడి వున్నాయి )

తన గురించి యేసు చెప్పినదేమంటే

- నేను లోకమునకు వెలుగైయున్నాను
- నేనే సత్యము
- నేనే జీవము
- నేనే మార్గము
- నా ద్వారానే యెవరైనా దేవుని వద్దకు రాగలరు.
- నేను ప్రజలను వారి పాపాలనుండి రక్షించుటకు నా రక్తము చిందిస్తాను. (బలిఅవుతాను) చనిపోయి పాతిపెట్ట బడి మూడోరోజున తిరిగి లేస్తాను.
- రెండవ సారి లోకానికి వచ్చి ప్రజలకు తీర్పుతీరుస్తాను.

యేసు బోధలవలన ప్రజలు సత్యము గ్రహించారు. వారు మతపెద్దలకు దూరమవసాగారు. మత నియమములతో ప్రజలను దోచుకొనే పెద్దలకు యేసు కొరకరానికొయ్య అయ్యాడు. వారి అస్థిత్వాన్ని యేసు బోధలు దెబ్బతీశాయి. మతపెద్దలు యేసుయెడల అసూయాద్వేషాలు పెంచుకొని, రగిలిపోయి, యేసుని చంపాలని ఆలోచించారు.

నీతిమంతుడైన యేసుక్రీస్తునందు ఎటువంటి దోషము కనుగొనలేక, కుట్రపన్ని, తప్పుడు ఆరోపణలతో యేసుని బంధించి, రోమాప్రభుత్వ పాలకులను బెదరించి, వారిపై వత్తిడి పెంచి యేసుని సిలువ వేయించారు.

దేవుని ప్రణాళికను గ్రహించని యూదామత పెద్దలు "మెస్సయా"(యేసుక్రీస్తు) అనగా రోమా ప్రభుత్వ పాలననుండి యూదా ప్రజలను విడిపిస్తాడు అనుకొన్నారు. కానీ ప్రజలను వారి పాపాలనుండి రక్షించువాడని తెలుసుకోలేకపోయారు. అయితే దేవుడు వారిద్వారానే యేసుక్రీస్తుని సిలువపై బలిగావించాడు.

శుక్రవారము నాడు సిలువపైని మరణించిన యేసుప్రభువుని సమాధిలో పెట్టారు. మూడవరోజు అనగా ఆదివారం సూర్యోదయం కాకుండానే యేసుప్రభువు సమాధినుండి తిరిగి లేచాడు. ఆ విధముగా నరునికి పాపముద్వారా సంక్రమించిన మరణాన్ని యేసుక్రీస్తు గెలిచాడు.

యేసుప్రభువు పునరుత్థానుడైనాక , నలువది దినములు తన శిష్యులకు, తనను వెంబడించిన వారికి కనిపించి,కలిసి వారితో అన్నపానములు పుచ్చుకొని గడిపాడు.

తన ఆఖరి ఆజ్ఞగా శిష్యులకు "భూదిగంతముల వరకు వెళ్ళి, నా సువార్తను ప్రకటించండి . ప్రజలను నా శిష్యులుగా చేయండి. నమ్మి బాప్తిసము తీసుకొన్న వాడు రక్షింపబడతాడు. నమ్మని వాడు నరకానికి పాత్రుడౌతాడు." అని చెప్పాడు. అటు తరువాత ఇ ఎదరూ చూస్తుండగా స్వర్గానికి ఆరోహణమయ్యాడు.

జరిగిన విషయములు తెలుసుకొన్న ప్రజలు క్రీస్తుబోధవైపు

ప్రోగ్గసాగారు. శిష్యులు క్రీస్తుని గురించి ప్రకటించసాగారు. యూదామతపెద్దలు, రోమనుప్రభుత్వము యేసు శిష్యులను, యేసుని వెంబడించిన వారిని హింసించి చంపసాగారు.

**'సౌలు'** అనే యూదామతవాది క్రైస్తవులను హింసించి చంపసాగాడు. దేవుడు తన మహిమ ద్వారా సౌలును తన సేవకునిగా మార్చుకొన్నాడు. ఆతనికి **'పౌలు'** అని పేరుపెట్టాడు. ఈయన యూదా దేశము చుట్టుప్రక్కలనున్న గ్రీకు, ఆసియా యూరోపు, మధ్య ప్రాచ్య దేశాలలో యేసుక్రీస్తుని గురించి ప్రకటించాడు. రోమను ప్రభుత్వము పౌలును బంధించి రోమ్ నగరంలో శిరశ్ఛేధన చేసింది.

## ప్రపంచంలో క్రైస్తవ మత విస్తరణ

యేసుక్రీస్తు జన్మించి, బలియై, మరణమును జయించి సర్వమానవాళికి రక్షణ కలిగిస్తాడని అన్ని మత గ్రంథాలు ప్రవచించాయి.

– హిందూ వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు యేసుక్రీస్తు బలియాగము గురించి తెలిపాయి. వేదపండితులకు ఈ విషయం తెలుసు

– ఋగ్వేదానికి సమకాలీనమైన 'జెండ్ అవస్త'లో కన్యగర్భాన రక్షకుడు జన్మిస్తాడని జొరాష్టరు వ్రాశాడు.

– మెతాయా (మెస్సయా) తదనంతరము 500 సంవత్సరాలకు జన్మిస్తాడని గౌతమబుద్ధుడు తెలిపాడు.

– చైనా మతస్థాపకుడు కన్‌ఫ్యూసియస్, పశ్చిమదేశాన పరిశుద్ధుడు జన్మిస్తాడని చెప్పాడు.

– దేవుడు ప్రవక్తలైన యెషయా, మీకా ద్వారా యేసుక్రీస్తు

గురించి తెలియజేశాడు.

బైబిల్‌లోనున్న ప్రతి పుస్తకము, ప్రతి సంఘటన యేసుక్రీస్తు చుట్టూ అల్లుకొని యున్నవి.

**పైన పేర్కొన్న ప్రవచనములు అన్నీ నెరవేరినవి. ఇది చారిత్రక సత్యము.**

క్రైస్తవులను రోమా ప్రభుత్వము, ఇతర దేశాల ప్రభుత్వాలు సుమారుగా నాలుగు వందల సంవత్సరములు హింసించారు. ఆఖరికి రోమా చక్రవర్తే క్రైస్తవుడైపోయాడు.

హింసించిన కొలది క్రైస్తవులసంఖ్య పెరిగింది. ప్రపంచచరిత్ర దీనిని ధ్రువీకరిస్తుంది. నేటికీ ఈ చరిత్ర ఈలాగునే కొనసాగుతున్నది. రష్యాదేశము ముక్కలయింది. కమ్యూనిస్టు ప్రభుత్వాలు కూలిపోయాయి. చైనా, బల్గేరియా, మొదలయిన దేశాలలో కూడా నేడు క్రైస్తవ్యము ప్రబలుచున్నది.

**భారతదేశములో క్రైస్తవ మతము:**

యేసుక్రీస్తు శిష్యులలో ఒకడు - తోమా - భారతదేశం వచ్చి యేసుని గురించి సువార్త ప్రకటించాడు. మద్రాసునగరంలో నున్న మౌంటు థామస్ కొండపై పూజారులు తోమాను బల్లెంతో పొడిచి చంపేశారు.

"దుష్టశిక్షణ - శిష్టరక్షణ" మనమెరిగిన ధర్మము. కాని! ఏ వొక్కడు నశించుట తనకు సమ్మతము కాదని, దుష్టులు నశించుటకంటే దుష్టులలోని దుష్టత్వము నశింపజేసి (పారద్రోలి) తన నీతిని వారి హృదయములలో స్థాపించి, మరుజన్మవలనకాక,

మారుజన్మ లేక మారుమనస్సు ద్వారా నూతన జీవితము పొందవలెనని యేసుప్రభువు సంకల్పించెను.

హిందూమత గ్రంధములలో యేసుక్రీస్తు గురించి నిగూఢముగా వున్న విషయములు తెలుసుకొన్న బ్రాహ్మణ పండితులు - పురుషోత్తం చౌధరి, పులిపాక జగన్నాథం, వేదనాయగము, వామనరావు తిలక్, మల్లాది వెంకటర్నతం, ధన్నవాద అనంతము, మండపాక కేశవరాయ శర్మ, ఆర్ ఆర్ కె మూర్తి, పరవస్తు సూర్యనారాయణ (చిన్నయ సూరి మనవడు), సాధు సుందర్ సెల్వరాజు మొదలగువారు- తమంతట తామే క్రైస్తవులయ్యారు.

భారతదేశములో క్రైస్తవులను హింసించిన వారే తరువాత కాలములో క్రైస్తవులై యేసుని గురించిన సువార్త చాటారు. విశ్వాసులైన క్రైస్తవులు యేసుక్రీస్తు కొరకై హింసను భరిస్తారు. ప్రాణాలను అర్పిస్తారు. కానీ, ప్రతిఘటించరు.

## యాజ్ఞవల్క్యుడు దేవునికి చేసిన ప్రార్థన

అసతోమా సద్గమయా = అసత్యమునుండి సత్యములోకి,
తమసోమా జ్యోతిర్గమయా = చీకటిలోనుండి వెలుగులోకి,
మృత్యోర్మాఅమృతంగమయా = మరణమునుండి జీవములోకి నడిపించు

## దానికి యేసుక్రీస్తు జవాబు

**నేనే సత్యాన్ని - నేనే వెలుగును - నేనే జీవాన్ని**
**వాటిలోకి నడిపించే మార్గాన్ని నేనే.**

అపుత్రస్య : గతిర్నాస్తి ; పున్నామ నరకము నుండి

## పుత్రుడు తప్పిస్తాడు

ఈ పుత్రుడు మానవుల కుటుంబములో స్త్రీ పురుషుల కలయిక వలన జన్మించిన వాడుకాడు.

ఈ **పుత్రుడు - యేసుక్రీస్తు** - సాక్షాత్తు దేవుని కుమారుడు, ప్రకృతికి అతీతముగా కన్య మరియకు పరిశుద్ధాత్మప్రమేయము వలన పుట్టినవాడు.

ఈ విషయములు స్పష్టముగా బైబిల్ గ్రంథములో వివరించబడి యున్నవి.

**"కుమారుని ముద్దుపెట్టుకొనుడి లేని యెడల ఆయన (దేవుడు) కోపించును"** - బైబిల్.

# యేసుక్రీస్తు రూపురేఖలు - వ్యక్తిత్వము

రోమా గవర్నరు పొంతి పిలాతు సమకాలీనుడైన పబ్లియెస్ లెంటులస్ అను రోమా అధికారి నివేదిక ప్రకారము:-

"యేసుక్రీస్తు పొడవైనవాడు, అందమైనవాడు. ఆకర్షణీయమైన, గంభీరమైన ముఖము గలవాడు. ముక్కు, నోరు తీర్చిదిద్దినట్లున్నవి. అమాయకమును, కరుణగల చూపుగలవాడు. జుట్టు రాగిరంగులో భుజముల వరకు జాలువారి ఉన్నది. ఆయన మాటలు శాంతముగాను, సాత్వికముగాను, వివేకముతో కూడియున్నవి. ఆయన గద్దింపు సింహగర్జనే. తరచూ దుఃఖపడి కన్నీరు కార్చువాడు. ఆయన నవ్వగా ఎవరూ చూడలేదు. మనుష్యులలోలేని తేజస్సు, గొప్పతనము ఆయనలో చూడగలము. విలక్షణమై వ్యక్తిత్వముగల ఆయనను చూచినంతనే గౌరవము,భయము, భక్తిభావము కలుగును. అందరూ ఆయనను "ప్రవక్త" అని భావించగా, ఆయన శిష్యులు ఆయనను దేవునికుమారునిగా తలచుచున్నారు. ఈ పుణ్యపురుషుడు చనిపోయినవారిని బ్రతికించుచున్నాడు. వివిధరకములైన రోగులను స్వస్థపరచుచున్నాడు......"

## హిందూమత గ్రంథాలలో నిక్షిప్తమైన నిజాలు

- క్రీ॥పూ॥ 2500-2000 సం॥మధ్య జరిగిన ప్రపంచ ప్రజల వలసలలో - ఆర్యులు భారతదేశానికి వచ్చారు. అదే సమయములో మరికొందరు - గ్రీకు, పర్షియా, ఈజిప్టు, యూరోపు దేశాలకు వలసపోయారు. గ్రీకు, పారశీక, హిందూ పురాణాలలోని దేవతా పాత్రలు ఇంచుమించుగా ఒకేలా వుంటాయి.
- ఆర్య ఋషులు తమ జ్ఞానాన్వేషణలో, దైవికముగా కొన్నివిషయాలు తెలుసుకొని, వాటిని శ్లోకాల రూపములో గ్రంథస్తము (కంఠస్థము) చేశారు. అవే వేదాలు, వేదాంగాలు. భాష సంస్కృతము. సామాన్య ప్రజలకు అర్థము కానిది.
- భారతదేశానికి మాత్రమే పరిమితమైన కులవ్యవస్థలో బ్రాహ్మణులదే పైచేయి. వారు హిందూమత గ్రంథాలను తమ ఆధీనములో వుంచుకొని, సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా కట్టడి చేశారు.
- దేవుడొక్కడే, మానవజాతి ఒక్కటే. దేవుడు - ఋషులకు, ప్రవక్తలకు తెలియజేసిన విషయాలు సమస్త మానవజాతికి ఉద్దేశించినవి.
- **సత్యము తెలిసికొని దానిని ఇతరులకు తెలియజేయుట విజ్ఞుల కర్తవ్యము.**
- కొన్ని శ్లోకాలు, వాటి తాత్పర్యము పాఠకుల సౌకర్యార్థము ఇందు పొందుపర్చడమైనది.

1) శ్లో॥ **ఉత్తమా తత్త్వ చింతవై, మధ్యమం శాస్త్ర చింతనం !**
**అధమా మన్త్ర చిన్తా చ, తీర్థ భ్రాంత్యధమాధమా !!**

**- మైత్రేయోపనిషత్ 2 : 21**

తా॥ సత్యమును గూర్చిన పఠనము ఉత్తమమైనది. శాస్త్రములు గూర్చిన పఠనము మధ్యమమైనది. మంత్ర జ్ఞానము అధమమైనది. తీర్థయాత్రలు చేయుట అధమాధమమైనది.

**<u>దేవుడు:</u>**

2) శ్లో॥ **వేదాహమేత మజరం పురాణం సర్వా, త్మానం సర్వగతం విభూత్వాత్ ! జన్మ నిరోధం ప్రవదంతి యస్య, బ్రహ్మావాదినోహి ప్రవదంతి నిత్యమ్ !!**

**- శ్వేతాశ్వతరోపనిషత్ 3 : 21**

తా॥ ఎవని శాశ్వతమగు జన్మరాహిత్యమును గూర్చి బ్రహ్మజ్ఞానము గలవారు చెబుతారో, ఆ వృద్ధాప్యము లేనివానిని, అతి ప్రాచీనుని, అంతటా ఉన్నవాడగు దేవునిని, నేను తెలిసికొన్నాను.

3) శ్లో॥ **తపఃప్రభావాద్ దేవ ప్రసాదాచ్చ, బహ్మాహశ్వేతాశ్వతరో అథవిద్వాన్ ! అత్యా శ్రమిభ్యః పరమం పవిత్రం, ప్రోవాచ సమ్యగృషి సంఘజుష్టమ్ !!**

**- శ్వేతాశ్వతరోపనిషత్ 6 : 21**

తా॥ తనయొక్క తపోప్రభావము చేతనూ, దేవుని కృపవలననూ, శ్వేతాశ్వతర మహర్షి సృష్టికర్తను తెలిసికొని, సర్వోత్కృష్టులగు సన్యాసులకు, సకల ఋషులు ఆశ్రయించే పవిత్రమైన సృష్టికర్తను గూర్చి చక్కగ ఉపదేశించాడు.

4) శ్లో॥ స పర్యగాచ్ఛుక్రమకాయ మవ్రణ మస్నావిరగ్ం
శుద్ధ మపాప విద్ధం, కవిర్మనీషి పరిభూః !
స్వయంభూర్యాథా తథ్యతో ర్థాన్
వ్యదధాచ్ఛా శ్వ తీభ్యః సమాభ్యః !!

- యజుర్వేదము 40 : 8

తా॥ దేవుడు సర్వాంతర్యామి, స్వచ్ఛమైనవాడు, నిర్మలుడు, శరీరము లేనివాడు, శరీర స్వభావము లేనివాడు, పరిశుద్ధుడు, పాపరహితుడు, జ్ఞానవంతుడు, ఆలోచనకర్త, సమస్త ప్రపంచమును పరివేష్టించినవాడు స్వయంభవుడు, నిత్యులగుతన జీవులకు కొరకు తగినట్లు వ్యవస్థ నొనర్చెను.

5) శ్లో॥ తృష్ణా, లజ్జా, భయం, దుఃఖం, విషాదో హర్ష మేవచ !
ఏభిర్దోషై ర్వి నిర్ముక్త స్స జీవ శ్శివ ఉచ్చతే !!

- యోగ శిఖోపనిషత్తు 1 : 11

తా॥ కామము, క్రోధము, భయము, మోహము, లోభము, మదము, రజోగుణము, జననము, మరణము, ఆత్మ జ్ఞానము లేకపోవుట, శోకము, సోమరితనము, ఆకలి, దప్పిక, లజ్జ, దుఃఖము, విషాదము, సంతోషము అను దోషగుణములు లేనివాడే శుభప్రదుడైన దేవుడు.

6) శ్లో॥ నైన మూర్ధ్వం న తిర్యంచ, నమధ్యే పరిజగ్ర భత్ !
న తస్య ప్రతిమా అస్తి యస్యనామ మహద్యశః !!

- శ్వేతాశ్వతరోపనిషత్ 4 : 19

తా॥ పైన ఆకాశమందుకాని, మధ్యలో గాని ఎవరూ ఆయనను పట్టుకోలేరు. ఆయనపేరు, ఆయన ఘనత, మహిమలు

అద్వితీయములు. ఆయనకు సమానమైన వారు ఎవరూ లేరు.

**సృష్టి :**

7) **శ్లో॥ ఆత్మావా ఇదమేక ఏవాగ్ర ఆసీత్ !**

**నాన్యత్ కించన విషత్ స ఈక్షత లోకాన్నుసృజాఇతి !!**

**- ఐతరేయోపనిషత్ మం. : 1**

**తా॥** ఈ అనంత సృష్టికి పూర్వమందే, నిత్య, సత్య, శుబుద్ధ స్వరూపుడగు పరమాత్మ (పరిశుద్ధాత్మ) ప్రకాశించుచుండెను. ఆ పరిశుద్ధాత్ముడే అనగా దేవుడు అన్ని లోకములను సృష్టించుటకు సంకల్పించెను.

8) **శ్లో॥ ఇవగ్ం సృజేయమితి, తస్మాద్యత్పురుషోబిగచ్ఛతి !!**

**- నృసింహపూర్వతాపిన్యుపనిషత్ 27(ఎ)మం : 2**

**తా॥** జగత్తును సృష్టించెదను అని దేవునికి కోరిక కలిగెను

9) **శ్లో॥ ఆపోవ ఇద మాసం త్సవిలమేవ**

**- బృహజ్జాబాలోపనిషత్తు 26 మం : 1**

**తా॥** సృష్టికి ముందు జలమయంగా వుండెను దానిపై దేవుని ఆత్మ సంచరించు చుండెను.

10) **శ్లో॥ అనుష్టు బుత్తమా భవతి, వాగ్వై అనుష్టుప్ !!**

**- నృసింహ పూర్వతాపిన్యుపనిషత్ 27(ఎ) మం : 1**

**తా॥** మొదటిది వాక్యమే. వాక్కులోనే సమస్తము లీనమగుచున్నవి. వాక్కుచేతనే సమస్తము పుట్టుచున్నది.

11) **శ్లో॥ ఏతద్ధ్యే వాక్షరం బ్రహ్మ ఏతద్ధ్యే వాక్షరం పరం !**

**ఏతద్ధ్యే వాక్షరం జ్ఞాత్వా యోయదిచ్ఛతి తస్యతత్ !!**

**- కఠోపనిషత్తు మం : 16**

**తా॥** ఏదైతే అక్షరమో (వాక్యమో) అదే బ్రహ్మ (గొప్పది). అక్షరమే (పరబ్రహ్మము) విశ్వమును సృష్టించెనని తెలుసుకొనువానికి సర్వకార్యములు సిద్ధించును.

**కల్పిత దేవతలు - విగ్రహారాధన :**

12) **శ్లో॥ నతం విదాథ య ఇమాజ జానా న్య ద్యుష్మాక మంతరం బభూవ !**

**నీ హారేణ ప్రావృతా జల్ప్యాచా సుతృప ఉక్థ శాష శ్చరన్తి !!**

**- ఋగ్వేదము 10 : 82 : 7**

**తా॥** సకల లోకములను సృష్టించిన సృష్టికర్తను మీరెరుగరు. మీ బుద్ధికి ఆయనను తెలుసుకొను శక్తి లేదు. ఆయన జీవితము మీ జీవితము వంటిది కాదు. అజ్ఞానమను పొగమంచు కప్పిన జనులు మీరు. **మీరు నానా కల్పనలు చేయుదురు.** మీరు ఇహ భోగములకే యత్నింతురు. తాత్వికముగా ఆలోచించరు.

13) **శ్లో॥ పాషాణైరాలయంబద్ధ్వా, దేవాః పాషాణ ఏవచ !**

**బ్రూహి పండితదెవస్తు, కస్మిన్ స్థానె సతిష్ఠతి ?**

**- ఆదిశంకరాచార్యులు**

**తా॥** ఓ పండితులారా! మీరు రాళ్ళతో మందిరాలను నిర్మించారు. అవే రాళ్ళతో మీ దేవుళ్ళయిన విగ్రహాలను నిర్మించారు. వాటిని మందిరాలలో కూర్చోబెట్టినారు. రెండూ రాళ్ళే గనుక వాటిలో మీ దేవుడు ఎవరు?

14) **శ్లో॥ సంత్యజ్య హృద్గు హేశానం, దేవమన్యం ప్రయాన్తి యే !**

**తే రత్న మభివాంఛన్తి త్యక్త, హస్తస్థ కౌస్తుభాః !!**

**- మహోపనిషత్తు 6 : 20**

తా॥ ఎవరైతే తమ హృదయ గుహయందున్న పరమేశ్వరుని విడిచి, ఇతర దేవతలను ఆరాధింతురో, అట్టివారు చేతియందలి అమూల్యమగు రత్నమును విడిచి, ఇతరమగు రత్నమును కోరువారే యగుదురు.

15) **శ్లో॥ అంతఃస్థం మాం పరిత్యజ్య బహిష్టం యస్తు సేవతే !**

**హస్తస్థం పిండ ముద్గృజ్య లిహే త్కూర్పర మాత్మనః !!**

**- దర్శనోపనిషత్తు 4 : 58**

తా॥ హృదయములో నివసించు నన్ను విడిచిపెట్టి, బాహ్యామైన బొమ్మలను సేవించువాడు, తన చేతియందలి అన్నపుముద్దని వదలి, మోచేతిని నాకు వాడగును.

16) **శ్లో॥ అంధం తమః ప్రవిశన్తి యే సంభూతి ముపాసతే !**

**తతో భూయ ఇవ తే తమో య ఉ సంభూత్యాగ్ం రత్యాః !!**

**- ఈశావాస్యోపనిషత్తు 12వ శ్లో**

తా॥ ఎవరైతే ప్రకృతిని పూజిస్తారో, వారు కన్ను పొడుచుకున్న కానరాని చీకటిలో ప్రవేశిస్తారు. ఎవరైతే ప్రకృతిలో పుట్టినవాని యందు ఆనందిస్తారో వారు అంతకంటే మరింత ఎక్కువైన చీకటిలో ప్రవేశిస్తారు.

**పాపము - ఫలితము :**

17) **శ్లో॥ కామ క్రోధవశాస్సర్వే దేవషిన్ పితృమానవాః !**

**- బ్రహ్మాండ పురాణము (శ్రీరంగమహాత్మ్యం 7వ అధ్యాయం)**

తా॥ సమస్త దేవతలును, ఋషులును, పితృదేవతలును, మానవులును కామక్రోధములకు వశులైన వారే.

18) **శ్లో॥ బ్రహ్మా విష్ణుస్తథా రుద్రస్తే చాహం కారమోహితా !**

**భ్రమస్త్యస్మిన్ మహాఽ గాదే సంసారే నృపసత్తమః !!**

**- దేవీ భాగవతము 4వ స్కందము, 8వ అధ్యా॥**

తా॥ బ్రహ్మ విష్ణు మహేశ్వరులు అహంకారముచేనజ్ఞానులై ఈ సంసార సాగరమున మునిగి తేలుచున్నారు.

19) **శ్లో॥ బ్రహ్మా విష్ణు రుద్రశ్చసర్వవా భూత జాతయ**

**నాశమేవాను దావంతి సలిలానీవ బాడబమ్ !!**

**- మహోపనిషత్తు 3వ అధ్యా॥**

తా॥ నీరు బడబాగ్ని యందు నాశన మొందునట్లు, త్రిమూర్తులు మరియు పంచభూతముల వలన బుట్టిన సర్వమును నాశనమునకే పరిగెత్తుచున్నవి.

**రక్షణ కొరకై ప్రార్థన :**

20) **శ్లో॥ అసతోమ - సద్గమయ, తమసోమ - జ్యోతిర్గమయ**

**మృత్యోర్మ - అమృతంగమయ, ఓం శాంతి - ఓం శాంతి - శాంతి :**

**- బృహదారుణ్యాక ఉపనిషత్**

తా॥ దేవా! మమ్మును అసత్యములో నుండి సత్యములోనికి చీకటిలో నుండి వెలుగులోనికి, మరణము నుండి జీవములోనికి, అశాంతి నుండి శాంతిలోకి నడిపించుము.

21) శ్లో॥ **పాపోహం పాపకర్మాహం పాపాత్మ పాప సంభవః !**
**త్రాహిమాం కృపయాదేవ, శరణాగత వత్సలః**
**అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ !**
**తస్మాత్ కారుణ్య భావేన రక్ష రక్ష పరమేశ్వరః**
**పాహి నామహమే వాగ్రోదయాలునాం త్వమగ్రణీః !**
**దయని యోమదన్యోస్తి తవకోత్ర జగత్రయేః**

**- మనుస్మృతి**

తా॥ నేను పాపిని, పాపము చేయుచున్నాను. నాయాత్మ పాపము కలది. నేను పాపము నందే జన్మించితిని, కాబట్టి శరణుజొచ్చిన వారియందు దయగలదేవా! నీ కరుణ చేత నన్ను రక్షింపుము. నీవు మాత్రమే నాకు దిక్కైనవాడవు. వేరెవరు నాకు దిక్కులేరు. నీ కరుణా భావము చేత ఓ పరమేశ్వరా ! రక్షింపుము, పాపులలో నేను మొదటి వాడను. దయగల వారిలో నీవు మొదటి వాడవు. మూడు లోకముల యందు నీదయచేత రక్షింపబడవలసిన వాడను నేనున్నాను.

**పాప పరిహారము - మరణమును జయించుట :**

22) శ్లో॥ **న పుణ్యం దానధర్మ నకర్మశ్చ పుణ్యం భవతే !**
**నపుణ్యో ప్రాణదనశ్చ జగత్పుణ్యం నాస్తిః నాస్తిః !!**

**- ఋగ్వేదము**

తా॥ దానధర్మముల చేతను, కర్మచేతను పుణ్యం కలుగదు ప్రాణదానము లేకుండా ప్రపంచమునకు పుణ్యమే లేదు.

23) **శ్లో॥ సర్వపాపపరిహారో రక్త ప్రోక్షణ మవశ్యకం**
**తద్రక్తం పరమాత్మేన పుణ్యదాన బలియాగం**

**- తాండియ మహా బ్రాహ్మణం**

**తా॥** పలు విధములైన పాపముల నుండి విడుదల కావలెనంటే రక్తప్రోక్షణం అవసరము. దేవుడు తన రక్తము చిందించుట (బలియాగం) ద్వారా పాప పరిహారము జరుగును.

24) **శ్లో॥ ప్రజాపతిర్ధే వేభ్యం ఆత్మానాం యజ్ఞం కృత్వాప్రాయశ్చిత్**

**- తాండిమ మహాబ్రాహ్మణము**

**తా॥** ప్రజాపతి (సృష్టికర్త) ప్రజల పాప పరిహారార్ధ నిమిత్తమై తన స్వంత శరీరమును ప్రాయశ్చిత్తముగా నలుగ గొట్టుకొని యజ్ఞమును చేయును.

25) **శ్లో॥ ప్రజాపతి శ్చరతి గర్భేత్వమేన ప్రతిజాయత్ తుభ్యం ప్రాణప్రజాస్థి**
**మా బలింహరంతయ : ప్రాణై ప్రతిష్టతి :**

**- ఋగ్వేదము**

**తా॥** ప్రజాపతి స్త్రీ గర్భమందు జన్మించి, బలిగావింపబడి, మరణం నుండి తిరిగిలేచి పునరుత్థానుడవుతాడు.

26) **శ్లో॥ న ఏవ కాలే భువనస్య గోప్తా, విశ్వాధిపః**
**సర్వభూతేషు గూఢ : ! యస్మిన్ యుక్తా బ్రహ్మర్షయో**
**దేవతాశ్చ, తమేవం జ్ఞాత్వా మృత్యుపాశాంశ్చినత్తి**

**- శ్వేతాశ్వతరోపనిషత్ 4 : 15**

**తా॥** తగిన సమయము వచ్చినప్పుడు ప్రపంచానికి రక్షకుడు ఆయన మాత్రమే. సకల లోకాలకు ప్రభువు, సర్వ జీవులలో దాగి ఉన్నదీ ఆయనే, దేవతలు, ఋషులు, ఆయన యందే

లీనమౌతారు. ఈ విధముగా ఆయన ప్రత్యక్షమైనప్పుడు మరణ బంధాలను నరికి వేస్తాడు. మరణము నుండి మానవుడు విడుదలౌతాడు.

**యేసుక్రీస్తు :**

27) **శ్లో॥ లిహ్వ్యా గోప్తారాం మహాక్యాదధిన, కుర్యంతి హావ్యాయాన పర్యతాసీన్**

**- సామవేదము**

తా॥ అవతరించబోవువాడు కన్యక గర్భమునందు పశువుల శాలలో జన్మించును.

28) **శ్లో॥ ఈశ పుత్రంచ మాం విద్ధికుమారీ గర్భసంభవం**
**మ్లేచ్ఛ ధర్మస్య వక్తారాం మసీహో హం సమాగత ః**

**- భవిష్య పురాణము**

తా॥ దేవుని కుమారుడు, కన్యక గర్భమున జన్మించునని తెలిసికొనుము, పాపులను నీతిమంతులుగా చేయుటకు ఆయన ప్రవక్తగాను, మెస్సీయా గాను అవతరించును.

29) **శ్లో॥ ఈశమూర్తి ప్రాప్త నిత్య శుద్ధ శివాకారి**
**ఈశ్ మసీహ్ ఇత్తైక్కమాం నామ ప్రతిష్ఠాతం**

**- భవిష్యపురాణం - భరతఖండం ప్రతిసర్గ 31వ అధ్యా॥**

తా॥ నిత్యుడు, పవిత్రుడు, దయామూర్తి మరియు ముక్తి ప్రదాతయగు దేవుని స్వరూపము గలవాడు - మన హృదయాలలో నివసిస్తున్నవాడు - ప్రత్యక్ష పరచబడినవాడు - అతని పేరే యేసుక్రీస్తు .

30) శ్లో॥ అంభస్య పారే భావనస్యమధ్యే నాకస్యవృష్టే మహతో మహీయాన్ శుక్రేణ జోతిగ్గంషి - స - అనుప్రవిష్ట ః ప్రజాపతి చరతి గర్భే అంతః

- ఋగ్వేదము

తా॥ ప్రజాపతియైన దేవుడు భూమి మీద అవతరించినపుడు మహా మహిమతో ఆకాశమందు ఒక నక్షత్రం ఆవిర్భవిస్తుంది.

31) శ్లో॥ యేషః దేవః ప్రదిశ్రోను సర్వాః పూర్వోహిజాప ః
న - ఉ - గర్భే - అంతః సయేవదేవః జన్నిణ్య మాణ ః

- ఋగ్వేదము

తా॥ యేసు అన్ని దిశలలోను మహాదేవుడైయున్నాడు. తూర్పు దేశమందు పరిశుద్ధమైన స్త్రీ గర్భమున అవతరించును. ఈయనే నిజమైన దేవుడు. ప్రజలందరూ ఎదురు చూస్తున్న దేవుడు. పాపములేని మహాపరిశుద్ధుడు ఈయనే.

32) శ్లో॥ తస్య ప్రజాపతే రర్ధమేవ మర్త్యమాసీరర్ధ మమృతం

- శతపథ బ్రాహ్మణము

తా॥ ప్రజాపతి (దేవుడు లేక సృష్టికర్త) సగము మర్త్యుడుగను సగము అమర్త్యుడుగ నుండి, మర్త్య శరీరమును బలిగ నిడి అమర్త్య శరీరముచే మృత్యువును ఓడించును.

33) శ్లో॥ చత్వార శృంగ త్రయో అస్య పాదాద్వే శీర్షే సప్తహస్తా
సో త్రిధాబద్ధో వృషభో రారవాతి - మహాదేవో మర్త్యాగం అవివేశః

- ఋగ్వేదము

తా॥ మహాదేవున్ని, మనుష్యరూపంలో నున్న గొర్రెపిల్లలాంటి శాంతమూర్తిని బలిపశువుగా మూడు మేకుల మీద, అనగా

రెండు చేతులలోను ఒక్కొక్కటి, రెండు కాళ్ళను కలిపి ఒకటి, దిగగొట్టి వ్రేలాడదీయ బడగా తలపై ఏడు మేకుల గల శిరస్త్రాణం (ముళ్ళకిరీటము) పెట్టారు.

**యేసుక్రీస్తు - శాశ్వత పరిపాలకుడు :**

34) **శ్లో॥ తము ష్టుహి యో అన్తః సిన్ధౌసూనుః !**

**సత్యస్య యువానమద్రోఘవాచం సుశేవమ్ !!**

**- అధర్వవేదము 6 - 1 - 2**

**తా॥** అంతము లేనివాడును, సముద్రములపైనున్నవాడును, పాపము లేనివాడును, వర్ణింపశక్యముకానివాడును, సత్యము కొరకు నియమింపబడినవాడును, సుగుణ సంపన్నుడును, యువకుడునగు ఆ కుమారుని స్తుతించు

35) **శ్లో॥ మహాన్ ప్రభుర్వై పురుషః సత్త్వస్యైష ప్రవర్తకః !**

**సు నిర్మలామిమాం ప్రాప్తి మీశానో జ్యోతి రవ్యయః !!**

**- శ్వేతాశ్వతరోపనిషత్తు 3 : 12**

**తా॥** ఈ పురుషుడు నిజముగా మహాప్రభువు, నియమించబడినవాడు, ఆయనే శాశ్వతమైన వెలుగు. అత్యంతమూ పరిశుద్ధమైన ఆ మోక్షమును అందుకొనేటట్లు చేయుటకుగాను ఆయన అందరి మనస్సులను త్రిప్పుతాడు.

36) **శ్లో॥ న తన్మయో హ్యామృత ఈశసంస్థో, జ్ఞః సర్వగో భుతావనస్యాస్య గోప్తా ! య ఈశే న్య జగతో నిత్యమేవ నాన్యో హేతుర్విద్యత ఈశనాయః**

**- శ్వేతాశ్వతరోపనిషత్ 6 : 17**

**తా॥** ఎవరైతే ఈ ప్రపంచము యొక్క శాశ్వతమైన పరిపాలకుడో,

ఆయనే ఈ విశ్వానికి ఆత్మ. ఆయన మరణములేనివాడు. పరిపాలనా అధికారము ఆయనదే. ఆయన సర్వజ్ఞాని, సర్వాంతర్యామి, ప్రపంచానికి రక్షకుడు, శాశ్వతంగా పరిపాలించే సమర్ధుడు, ఆయన తప్ప మరొకడు లేడు.

37) శ్లో॥ **న తత్ర సూర్యో భాతి న చంద్ర తారకం, నేమా విద్యుతో భాంతి కుతో! యమగ్నితమేవ భాంతమను భాతి సర్వం, తస్యభాసా సర్వమిదంవిభాతి !!**

**- శ్వేతాశ్వతరోపనిషత్ 6 : 14**

తా॥ అక్కడ సూర్యుడు ప్రకాశించడు. చంద్రనక్షత్రాలు కాంతినీయవు. ఈ మెరుపులు ప్రకాశించవు. ఇక అగ్ని ప్రకాశమీయగలదా? ఈ వెలుగైనవాని ద్వారానే ఇదంతా ప్రకాశిస్తుంది.

**ముక్తాయింపు :**

38) శ్లో॥ **చతుర్వేద విదో విప్ర సూక్ష్మ బ్రహ్మం నవిదతి !**
**వేద భార భరక్రాంత స్సవై బ్రాహ్మణ గర్ధభః !!**

- కులాచార పరీక్ష - పురుషోత్తమ చౌధరి

తా॥ గంధపు చెక్కలను మోసి వాటి సువాసన ఎరుంగని గాడిద యెటువంటిదో, చతుర్వేద విద్వాంసుడై యుండి సూక్ష్మ బ్రహ్మమును తెలియని విప్రుడును అటువంటి వాడే.

లేఖనములయందు మీకు నిత్యజీవము కలదని తలంచుచు, వాటిని పరిశోధించుచున్నారు. అవే నన్ను గూర్చి సాక్ష్యం ఇచ్చుచున్నవి.

- యేసుక్రీస్తు


లేఖనములు = దేవుడు ప్రవక్తలు, ఋషులు ద్వారా బయలుపరచిన విషయములు.

నిత్యజీవనము = మోక్షము.

పై శ్లోకాలు కీ॥శే॥ సి. హెచ్. ఫ్రాన్సిస్, శ్రీ పరవస్తు సూర్యనారాయణరావు, శ్రీ గుండాబత్తుని దేవదానము, శ్రీ కణితి అబ్రహాము గార్ల రచనల నుండి సేకరించబడినవి.

చీకటిలో నడుచు జనులు గొప్ప వెలుగును చూచుచున్నారు.
మరణచ్ఛాయ గల దేశనివాసుల మీద వెలుగు ప్రకాశించును.
ఆ వెలుగు చీకటిలో ప్రకాశించుచున్నది గాని చీకటి దాని గ్రహింపకున్నది.
పై వాక్యముల వివరణే... ఈ

# తమసోమా జ్యోతిర్గమయా...



**Rs. 10.00**